క్లుప్తంగా

ధర్మప్రచార వారోత్సవాలకు ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే విశ్వకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న పెన్నహోబిలం ఈఓ, అర్చకుడు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించనున్న ధర్మప్రచార వారోత్సవాలకు ఉరవకొండ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకుడు ద్వారకనాథ్ చార్యులు శనివారం ఆహ్వానించారు. అనంతరంలోని మాజీ ఎమ్మెల్యే నివాసానికి వారు వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. రాష్ట్ర ప్రజల సౌభాగ్యం, హిందూ సంస్కృతి సంప్రదాయాల వ్యాప్తి కోసం దేవదాయ ధర్మదాయశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ధర్మప్రచార వారోత్సవాల్లో పాల్గొనాలని వారు కోరారు. ఈసందర్భంగా నిర్వహణకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సర్వమంగళ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగంలో నందు, అండర్-17 విభాగంలో వరుణ్‌కుమార్ అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

అంజన్నకు అభిషేకం




అలంకరణలో అంజన్న

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

రాయదుర్గంటౌన్: నైరుతీ రైల్వే హుబ్లి డివిజన్ పరిధిలో కారటగి-సిద్దాపురం స్టేషన్ల మధ్య రైలు మార్గం నిర్మాణ మరమ్మతుల కారణంగా పలు రైళ్లు దారి మళ్లించగా, కొన్ని పాక్షికంగా రద్దు చేసినట్లు నైరుతీ రైల్వే హుబ్లి డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ అనీష్ హెగ్డే తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యశ్వంతపూర్-కారటిగి నడుమ ప్రయాణించే రైలు(16546) ఈ నెల 22 నుంచి డిసెంబర్ 1 వరకూ కారటిగి నుంచి కాక గంగావతి నుంచి యశ్వంత్‌పూర్ మధ్య నడుస్తుందన్నారు. గంగావతి-కారటిగి మధ్య ప్రయాణం చే రైలు(16545) రద్దు చేశామన్నారు. అలాగే బీజాపూర్-యశ్వంత్‌పూర్ నడుమ ప్రయాణించే రైలు (06545/06546) ఈ నెల 18 నుంచి 20 వరకూ దావణగెర మార్గం మీదుగా కాకుండా రాయదుర్గం, బళ్లారి, హొసపేట మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.


సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న సెబ్ సీఐ, ఐటీఐ ప్రిన్సిపాల్

ఉరవకొండ: యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే ఖాతాల్లో డబ్బు మాయం అవుతుందని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, సెబ్ సీఐ మారుతిరావు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ యువకులు ఆన్‌లైన్‌లో ఎక్కువ శాతం షాపింగ్ చేయడం, ఇతర ఆఫర్లకు ఆకర్షితులై సైబర్ వలలో చిక్కుకుంటున్నారన్నారు. దీని పట్ల జాగ్రత్తగా ఉంటూ ఎవ్వరికి ఓటీపీలు షేర్ చేయరాదన్నారు. అలాగే బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు లక్ష్మారెడ్డి, ఐసీడీఎస్ రమాదేవి, అనిత పాల్గొన్నారు.

ఆలయాలకు కొత్త శోభ



బ్రహ్మసముద్రం మండలం యనకల్లులోని ఈశ్వరాలయం

- నియోజకవర్గంలో 19 ఆలయాలకు టీటీడీ నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని పలు ఆలయాలకు కొత్త శోభ రానుంది. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తరఫున కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పలు ఆలయాలకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేశారు. ఆలయాల అభివృద్ధిపై టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డితో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ చర్చించి నిధుల విడుదలకు కృషి చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ పథకం నుంచి నిధులు..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకారుల కాలనీలలో ఆలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ పథకం నుంచి ఫేజ్-3 కింద నిధులు విడుదలయ్యాయి. ఒక్కో యూనిట్ వ్యయంతో పనులు చేపట్టాలని టీటీడీ దేవాదాయ శాఖను ఆదేశించింది. ఒక్కో యూనిట్ మొత్తంగా రూ.10 లక్షలను వెచ్చించనుంది. ఇందులో రూ.8 లక్షలు ఆలయ నిర్మాణానికి, మరో రూ.2 లక్షలు వివిధ దేవతా మూర్తుల విగ్రహాల కొనుగోలుకు వెచ్చించాలని సూచించింది. అన్ని పన్నులు, ఓవర్‌హెడ్‌లు మొదలైన వాటితో సహా ఈ పథకానికి ఆమోదించిన డిజైన్ ప్రకారం పనులు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సుమారు 19 ఆలయాలకు టీటీడీ నిధులు విడుదలయ్యాయి.

నిధులు విడుదలైన ఆలయాలు..

మండలం	గ్రామం	ఆలయం పేరు
బ్రహ్మసముద్రం	అజ్జయ్యదొడ్డి	శ్రీకృష్ణ ఆలయం
కంబదూరు	అండేపల్లి	బ్రహ్మయ్య ఆలయం
కంబదూరు	గుద్దెళ్ల	యల్లమ్మ ఆలయం
కంబదూరు	కదిరిదేవరపల్లి	కొల్లాపురమ్మ దేవస్థానం
కంబదూరు	కంబదూరు	గంగమ్మ ఆలయం
కంబదూరు	మర్రిమాకులపల్లి	కొల్లాపురమ్మ ఆలయం
కంబదూరు	ములకనూరు	కావేలమ్మ దేవస్థానం
శెట్టూరు	బచ్చేహళ్ళి	మారెమ్మ ఆలయం
శెట్టూరు	కనుకూరు	దుర్గమ్మ ఆలయం
శెట్టూరు	తిప్పనపల్లి	మస్తెమ్మ ఆలయం
శెట్టూరు	యాటకల్లు	ఈశ్వర ఆలయం
కళ్యాణదుర్గం	దురదకుంట	బ్రహ్మయ్య ఆలయం
కళ్యాణదుర్గం	కొండాపురం	మారెమ్మ ఆలయం
కళ్యాణదుర్గం	కురాకుల తోట	ఆంజనేయస్వామి ఆలయం
కళ్యాణదుర్గం	మల్లిపల్లి	ఈశ్వర ఆలయం
కళ్యాణదుర్గం	శీబావి	శ్రీరామ ఆలయం
బ్రహ్మసముద్రం	సూగేపల్లి	కొల్లాపురమ్మ ఆలయం
బ్రహ్మసముద్రం	వేపులపర్తి	వాలప్ప ఆలయం
బ్రహ్మసముద్రం	యనకల్లు	ఈశ్వరాలయం

పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా



నియోజకవర్గంలో 19 ఆలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు మంజూరు చేయడం చాలా సంతోషం. ఇది నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఇదంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువే. అడిగిన వెంటనే నిధులు విడుదల చేసిన టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు. – కేవీ ఉషశ్రీచరణ్, మంత్రి

దొంగ ఓట్ల పాపం టీడీపీదే

- ఓటరు జాబితాలో అక్రమాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తాం
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: దొంగ ఓట్లు చేర్పించిన పాపం టీడీపీదేనని, ఆ నెపం వైఎస్సార్‌సీపీపై నెట్టి ప్రజల్లో సానుభూతి పొందేలా ఈ తెలుగు దొంగలు వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ వలీబాషా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి గోవిందుతో కలసి విప్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2017-19 మధ్య కాలంలో ప్రజాబలం కోల్పోయిన టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షలకు పైగా దొంగ ఓట్లు చేర్పించిందన్నారు. గడిచిన 2019 ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలవాలనుకున్న చంద్రబాబును ప్రజలు 23 సీట్లకే పరిమితం చేశారన్నారు. రాయదుర్గంలోనూ కాలవ శ్రీనివాసులు అప్పట్లో మంత్రి పదవిని అడ్డుపెట్టుకుని సుమారు 30 వేలకు పైగా దొంగ ఓట్లు చేర్పించారన్నారు. కుప్పంలో చంద్రబాబు 60 వేలకుపైగా తమిళనాడు, ఇతర ప్రాంతాలకు చెందిన వారి ఓట్లు చేర్పి గెలుపొందారని దుయ్యబట్టారు. తాజాగా రాయదుర్గం లో ఫారం-6 (కొత్తగా) ఓట్లు చేర్చేందుకు 12 వేలు దరఖాస్తులు వస్తే, ఇందులో 90 శాతం టీడీపీ వాళ్లే ఇచ్చి ఉంటారన్నారు. అలాగే 7 వేల ఓట్లు తొలగింపులు, 15,357 సవరణ కోసం దరఖాస్తులు స్వీకరించారన్నారు. టీడీపీ హయాంలో సర్వే పేరుతో కొందరు రాయదుర్గంలో చొరబడి వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుల ఓట్లు తొలగించే కుట్రలు చేసిన దుర్మార్గుడు కాలవ శ్రీనివాసులని ధ్వజమెత్తారు.

ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలి

ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తికి ఒక్క చోట మాత్రమే ఓటు హక్కు ఉండేలా చర్యలు చేపట్టాలని భారత ఎన్నికల కమిషన్‌కు విప్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయం పై ఎన్నికల కమిషన్‌ను కలసి విజ్ఞప్తి చేస్తామన్నారు. బొమ్మనహాళ్ మండలంలో ఎక్కువ శాతం సెటిలర్స్ ఓట్లు ఉన్నాయన్నారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో స్థిరపడ్డ వారికి ఇక్కడ ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయన్నారు. అలాంటి ఓటర్లపై విచారణ చేపట్టేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దొంగ ఓట్లు తొలగిపోతాయనే బాధతోనే టీడీపీ నాయకులు, వారికి వంత పాడే పచ్చమీడియా గగ్గోలు పెడుతోందన్నారు. దొంగ ఓట్లు తొలగిపోతే సీఎం జగన్ చెప్పినట్లు కుప్పం సహా మిగిలిన 174 నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం తథ్యమన్నారు.

దోపిడీ దొంగ చంద్రబాబు

స్కిల్‌స్కాం లో రూ.371 కోట్లు దోపిడీ చేసి అడ్డంగా దొరికిపోయిన దొంగ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అని విప్ కాపు ధ్వజమెత్తారు. 52 రోజుల పాటు జైల్లో ఊచలు లెక్కించి కంటిశస్త్ర చికిత్స పేరుతో కండీషన్ బెయిల్‌పై బయటకొచ్చాడని గుర్తుచేశారు. ఈ నెల 28న సాయంత్రం 5 గంటలకు రాజమండ్రి జైలుకు హాజరుకావాల్సి ఉండగా అప్పుడే గుండె జబ్బులాంటి కారణాలు చూపి బెయిల్ పొడగించుకునేలా కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. జైల్లోకి వెళ్లే రెండు రోజుల ముందు రాయదుర్గం సభలో 'వైఎస్సార్ నాపై 28 ఎంక్వైరీలు వేయించారు..? జగన్ మళ్లీ వేయిస్తున్నాడు ఏం పీక్కుంటారు తమ్ముళ్లూ. నేను ఏ తప్పుచేయను, నన్ను ముసలోడు అంటారు. నేను ఫిట్‌గా ఉన్నాను. పరిగెత్తమంటే పరిగెత్తుతా' అంటూ చెప్పి జైలుకెళ్లగానే రోగాలు వెతుక్కుంటు వచ్చాయా..? అంటూ నిలదీశారు. టీడీపీ అధికారిక ఖాతాల్లోకి రూ.4.81 కోట్లు, రూ.25.31 కోట్లు, రూ.2.26 కోట్లు, రూ.33.47 కోట్లు ఇలా విడివిడిగా మొత్తం రూ.66 కోట్లు జమయ్యాయన్నారు. స్కిల్‌స్కాం జరగలేదంటే ఎలా నమ్మాలో బాబు, ఈ మురికి కాలువ సమాధానం చెప్పాలన్నారు.

రహదారులకు మహర్దశ

నియోజకవర్గంలోని రాయదుర్గం- భూపసముద్రం ప్రధాన రహదారి నుంచి కలుగోడు వరకూ రూ.4.11 కోట్లు, కణేకల్లు- ఉరవకొండ దారిలో బెళుగుప్ప, గుండ్లపల్లి అప్రోచ్‌రోడ్డుకు రూ. 4.33 కోట్లు మొత్తం రూ.8.45 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. త్వరలో ఈ రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ బుజ్జి, సర్పంచులు కేపీదొడ్డి రమేష్, ఉమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, వన్నూరప్ప, పక్రుద్దీన్, షబ్బీర్, ఆయా వార్డుల ఇన్‌చార్జులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ కరుణకుమారి

రాయదుర్గం రూరల్: నాలుగు నెలల నుంచి ఓటరు జాబితా సవరణపై సమావేశాలు నిర్వహించి తొలగింపులు, మార్పులు, చేర్పుల గురించి పదే పదే వివరించినా నిర్లక్ష్యం ప్రదర్శించడం తగదని ఈఆర్‌ఓ (అన్‌సెట్ సీఈఓ) కరుణకుమారి అసహనం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె శనివారం అఖిల పక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు తొలగింపులు, మార్పులు, చేర్పులు ఉండాలన్నారు. బీఎల్‌ఓల పనితీరును ఆయా పార్టీల బీఎల్‌ఏలు, అధికారులు పర్యవేక్షించాలన్నారు. తొలగింపులకు దరఖాస్తులు ఇచ్చి నెలలు గడిచినా, తొలగించలేదని, కొత్త జాబితా అంటూ పాత జాబితానే ఇచ్చారని, అందులో మృతి చెందిన వారి పేర్లు అలాగే ఉన్నాయని వివిధ పార్టీ నాయకులు ఈఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆమె స్పందిస్తూ కనీసం డెత్ డిలీషన్ కూడా చేయకపోవడం పట్ల మీ నిర్లక్ష్యం ప్రస్ఫుటం అవుతోందని తహసీల్దార్ల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండకూడదని, జాబితా ముద్రణ తరువాత మృతి చెందిన వారి పేర్లు ఉంటే అందుకు తహసీల్దార్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఓబులేసు, బ్రహ్మయ్య, బాలఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, రజాక్‌వలి, ఈడీటీ సుజాత, డీటీ బసవకుమార్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, ఆర్‌ఐ చంద్రశేఖర్, అఖిల పక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జాబితాలో తప్పులు లేకుండా చూడండి..

కణేకల్లు: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తహసీల్దార్ రజాక్‌వలీ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డబుల్ ఎంట్రీ, స్థానికేతరులు ఓటరు జాబితాలో లేకుండా చూడాలన్నారు మార్పులు, చేర్పులు సక్రమంగా చేయాలన్నారు. అర్హులను ఓటరు జాబితాలో చేర్చాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఉరవకొండ: స్థానిక లాలుస్వామి గుడి వద్ద నివాసముంటున్న ఎలక్ట్రీషియన్ గాజుల సురేష్ పనిచేస్తుండగా ఇటీవల తీవ్రంగా గాయపడ్డాడు. కటింగ్ మిషన్ రన్నింగ్‌లో ఉండగా చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. శనివారం ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధితుడికి రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

వాల్మీకులందరూ ఐక్యంగా ముందుకెళ్లాలి



జ్యోతులు, బోనాలతో వెళ్తున్న మహిళలు

కంబదూరు: వాల్మీకులందరూ ఐక్యంగా ముందుకెళ్తే అభివృద్ధి సాధ్యమని మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, సర్పంచ్ రామలక్ష్మమ్మ సూచించారు.శనివారం మండలంలోని నూతిమడుగు గ్రామంలో వాల్మీకి జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులు, బోనాలతో ఊరేగింపుగా వెళ్లి వాల్మీకి విగ్రహానికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



కలశాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని నారాయణపురంలో శనివారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వెంకటేశులు, సర్పంచ్ తలారి సుగుణ మాట్లాడుతూ వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, రామూర్తి, మంజునాథ్, రామాంజనేయులు, చన్నమల్ల, వన్నుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



జెండా ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి

బొమ్మనహాళ్: సహకార వ్యవస్థకు రైతులే మూల స్తంభాలని సొసైటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ సొసైటీలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి రైతులు, అధికారులు కృషి చేయాలన్నారు. సహకార వ్యవస్థ వల్ల ఉపయోగాలు, రైతు భరోసా పథకం అమలు, రుణ సౌకర్యం, సహకార సంఘం పథకాలు, వడ్డీ సౌలభ్యం, రసాయనిక ఎరువుల విక్రయాలపై ఆయన వివరించారు. అంతకు ముందు ఆయన జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



ఉరవకొండ గ్రంథాలయంలో మెటీరియల్‌ను పరిశీలిస్తున్న వైస్ ప్రిన్సిపాల్, డిగ్రీ విద్యార్థినులు



శెట్టూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉరవకొండ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అరుణజ్యోతి సూచించారు. శనివారం వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రంథాలయాల ఆవశ్యకతపై డిగ్రీ విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గ్రంథాలయ అధికారి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-3, 4, రైల్వే తదితర పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయాల్లోనే అందుబాటులో ఉంటాయన్నారు. పుస్తకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శెట్టూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిచారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి గ్రంథాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు నిత్యం పాఠ్యపుస్తకాలనే కాకుండా గ్రంథాలయం వెళ్లి వివిధ రకాల పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రజని ప్రధానోపాధ్యాయుడు ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం వెలికి తీయడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణ రెడ్డి

కూడేరు: గ్రామీణుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలన్న ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీపీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్ర'పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ నాగభూషణరెడ్డితో కలసి ఎంపీపీ మాట్లాడుతూ 15 ఏళ్ల వయసు పైబడిన వారంతా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.క్రికెట్, కబడ్డీ, బాట్మింటన్, ఖోఖో, వాలీబాల్ ఆటలుంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 20 నుంచి డిసెంబర్ 5 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిసెంబర్ 15 నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. అందరూ సమష్టిగా పని చేసి ఆడుదాం ఆంధ్రాని విజయవంతం చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ ఆశా, పీడీలు అక్కులప్ప, నరసింహులు, రిజ్వాన, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి ఫైనల్ మ్యాచ్‌కు ఎల్‌ఈడీ స్క్రీన్

రాయదుర్గం: భారత్- ఆస్ట్రేలియ జట్ల మధ్య ఆదివారం జరిగే వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తనయుడు కాపు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నట్లు క్రీడాకారులు తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌ను ప్రజలంతా సంతోషంగా ఒకేచోట వీక్షించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వివరించారు. యువత, క్రీడాభిమానులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు.

రైల్వేస్టేషన్‌లో నిబంధనలు పాటించాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ ఉమా మహేష్ హెచ్చరించారు.ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా స్టేషన్ ఆవరణలో బహిరంగ మలమూత్ర విసర్జన చేయరాదన్నారు. ద్విచక్రవాహనాలు, సైకిళ్లు రైల్వే ప్లాట్‌ఫారం ఆవరణలో ఉంచే వారిపై రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేస్తామన్నారు. రైల్వే స్టేషన్ లోపల రైలు టికెట్ లేదా ప్లాట్‌ఫాం టికెట్ లేకుండా సంచరిస్తే జరిమానా విధిస్తామన్నారు. రైల్వేస్టేషన్ వద్ద ఆటోలు ఆటోస్టాండ్ వద్దనే ఆపి ఉంచాలని, పరిధి దాటి వస్తే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

బాలికలను కాపాడుకుందాం



మానవ హారం నిర్వహిస్తున్న బాలికలు

బ్రహ్మసముద్రం: బాల్య వివాహాలను అరికట్టి బాలికలను కాపాడుకుందామని అధికారులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మహిళ, శిశు సంక్షే శాఖ, ఆర్డీటీ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించారు. ముందుగా మండలకేంద్రంలోని ప్రధాన కూడలిలో విద్యార్థులతో కలిసి బాలల హక్కుల ను కాపాడుకుందాం అంటూ నినాదిస్తూ ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలవివాహాలకు ప్రయత్నించినా, సహకరించినా జైలు శిక్ష తప్పదన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలకు పాల్పడితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 112కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ టీమ్ లీడర్ ఆదినారాయణ, ఎంఈఓ క్రిష్ణానాయక్, వైస్ ప్రిన్సిపాల్ కృపమ్మ, కేజీబీవీ ఎస్‌ఓ మహాలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఖాసీబీ, రామాంజనమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కరువు జాబితా తయారు చేయండి

రాయదుర్గం రూరల్: మండలం కరువు జాబితాలో ఉన్నందున 20వ తేదీ వరకూ క్షేత్రస్థాయి పర్యటన చేసి, 33 శాతం కంటే ఎక్కువ దెబ్బతిన్న పంటలను గుర్తించి జాబితా తయారు చేయాలని ఏఓ మహేంద్ర సూచించారు. తహసీల్దార్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఆయన ఆర్బీకే సిబ్బంది, వీఆర్‌ఓ, విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. 25వ తేదీ సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రంలో జాబితాను ప్రచురించాలన్నారు. అభ్యంతరాలు ఉన్న రైతులు 27వ తేదీలోగా అర్జీలు ఇవ్వాలన్నారు. తుది జాబితా 27వ తేదీ ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. వేరుశనగ, పత్తి పంట హెక్టారుకు రూ.17 వేలు, కంది, ఆముదం పంటకు రూ.8,500 నిర్ణయించారన్నారు. ఈ పంట నమోదు చేయించుకున్న రైతులు సోమవారం సాయంత్రంలోగా పొలం పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పుస్తకం జిరాక్సులు ఆర్బీకే సిబ్బందికి అందజేయాలన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నరసింహులు

ఉరవకొండ: ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎంపీపీ నరసింహులు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారుల పై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ అమృతరాజ్‌ను ఆదేశించారు. ఉరవకొండ ఎంపీటీసీ ఈడిగప్రసాద్, రేణుమాకుపల్లి రామాంజనేయులు మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రభుత్వ సబ్సిడీ బియ్యం సరిగా సరఫరా కావడం లేదని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని నెరిమెట్ల సర్పంచ్ యోగేంద్రరెడ్డి కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా శివనారాయణ

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా శివ నారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనంతపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ గుత్తికి బదిలీ అయ్యారు. ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు.